www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
ఆదివారం | 16 | ఫిబ్రవరి | 2025
పేజీలు 7

## గిరిజనుల ఆరాధ్య దైవం సంత్‌శ్రీ సేవాలాల్



-ఆయన చూపిన మార్గంలో పయనించాలి
-జయంతి వేడుకల్లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

2లో

# రైతు భరోసాలోనూ కోత

| Farmer Details | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| S. No | Finyear & Season | PPB No Mobile Number | Farmer Name(T)/ Farmer name(E) ( Father Name) | Bank Details (Bank , Branch , Acc No , IFSC Code) | Total Extent , Non Arable Extent, Arable Extent Paid Extent | Sub Survey Details | Total Amount | Cheque Details (Cheque No. , Issued by , Date on the Cheque) | Cheque Distributed date, Cheque Cleared Date | DBT Amount | Cheque / DBT Status | DBT Transaction Details (UTRNo , Payment Date) |
| District : KHAMMAM | | | | | | | | | | | | |
| Mandal : NELAKONDAPALLE | | | | | | | | | | | | |
| Village : RAJESWARAPURAM | | | | | | | | | | | | |
| 1. | 2024 - Yasangi | T26120010330 9505484017 | బాగం ఉమ BAAGAM UMA (కోటయ్య) | STATE BANK OF INDIA KODAD HUZURNAGAR X ROAD 31329581935 SBIN0006315 | 2.2200 0.0000 2.2200 2.0200 | 553 (0.3500 ),556/ఈ (0.0700 ),556/ఇ (0.0700 ),551/అ (0.0300 ),551/ఆ (0.0300 ),554 (1.0700 ) | 12300 | | | 12300 | Scheme Amount Credited to Bank Account Successfully | RBI044253028368 7 12/02/2025 |
| | | | | | | | | | | 12300 | | |



-ఎకరం ఉంటే మూడు వేలు మాత్రమే జమ
-ఎవరిని అడిగినా సమాధానం దొరకని పరిస్థితి

ప్రజాపక్షం/ఖమ్మం : రుణమాఫీ తరహాలోనే రైతు భరోసా సాగుతుందన్న ఆరోపణలకు అనేక ఘటనలు ఊతమిస్తున్నాయి. అనేక మంది రైతుల ఖాతాల్లో భూ విస్తీర్ణానికి అనుగుణంగా రైతుభరోసా నగదు జమ కావడం లేదని రైతులు వాపోతున్నారు. ఇందుకు సరైన కారణాన్ని వ్యవసాయ అధికారులు కానీ, రెవెన్యూ అధికారులు కానీ చెప్పలేకపోతున్నారు. అయితే ఒక సర్వే నెంబరుకు సంబంధించి ప్రభుత్వ రికార్డుల ప్రకారం ఉన్న భూ విస్తీర్ణం కంటే ఆ సర్వే నెంబరులోని

మిగతా 2లో..

# జనాభా ప్రకారమే బిసిలకు రిజర్వేషన్లు కల్పించాలి

-ఖమ్మంలో బిసి రౌండ్ టేబుల్ సమావేశంలో ఎంఎల్‌సి కవిత
-నగరంలో విస్తృత పర్యటన
-జైలులో ఉన్న బిఆర్ఎస్ నాయకులకు పరామర్శ




ప్రజాపక్షం/ఖమ్మం : జనాభా ప్రకారమే బిసిలకు రిజర్వేషన్లు కల్పించాలని విద్యా, ఉపాధి, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లకు సంబంధించి మూడు వేర్వేరు బిల్లులను ప్రవేశపెట్టాలని బిఆర్ఎస్ నేత, ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. కుల సర్వే పూర్తి స్థాయి నివేదికను శాసనసభలో ప్రవేశపెట్టడంతో పాటు డెడికెటెడ్ కమిటీ నివేదికను బహిర్గతం చేయాలన్నారు. శనివారం ఖమ్మంలో కవిత విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక సప్తపది ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన బిసి రౌండ్ టేబ్ల్ సమావేశంలో కవిత మాట్లాడుతూ విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42 శాతం మాత్రమే రిజర్వేషన్లు కల్పించనడం దారుణమని జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కేటాయించాలన్నారు.


మిగతా 2లో..

# వి'హంగమా' నీవెక్కడ..!?



- శతాబ్దికాలం పైబడిన విడిది.. ఇక అందమైన జ్ఞాపకమేనా..?
- అటవీశాఖ పట్టింపులేనితనంతో కొంగలకు రక్షణ కరువు
- ముఖం చాటేయడంతో చిన్నబోయిన చింతపల్లి గ్రామం
- తిరిగిరావాలని కళ్లల్లో ఒత్తులేసుకుని ఎదురుచూస్తున్న ప్రజలు





(ఫైల్)

ప్రజాపక్షం/ఖమ్మంరూరల్: శాతబ్దకాలంపైబడి సైబీరియా కొంగలకు విడిదినిచ్చిన చింతపల్లి ఇక అందమైన జ్ఞాపకంగా మిగిలిపోనుందా? అంటే ఔననే సమాదానాలు వినిపిస్తున్నాయి. ప్రతి ఏటా కొంగలతో సందడిగా ఉండే ఆ ఊరు నాలుగేండ్లుగా పక్షుల చప్పుడు లేక మూగబోయింది. పచ్చనిపంట పొలాలు, కూరగాయాల తోటలు, రమణీయమైన చెరువు, చింతచెట్ల తోపులు, గ్రామస్థులు విధించుకున్న కట్టుబాట్లపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. వేల కిలోమీటర్లు ప్రయాణం చేసి అత్యంత శీతల ప్రదేశమైన సైబీరియ నుంచి కొంగలు రాకపోవడంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోతుల బెడద, చింతచెట్ల నరికివేత, అటవీశాక అధికారుల పట్టింపు లేకపోవడంతోనే తమ స్వర్గధామంపై ముఖం చాటేశాయని ఆవేదన చెందుతున్నారు. ఖమ్మం జిల్లా పాలేరునియోజకవర్గంలోని రూరల్ మండలంలో పచ్చని ప్రకృతి అందాలను నింపుకున్న చింతపల్లి గ్రామం ఉంది. ఇక్కడికి సైబీరియా నుంచి వందలాది కొంగల గుంపు జనవరిమాసంలో వచ్చి జూన్‌లో తిరిగి వెలుతుంటాయి. వీటి రాకకుముందు గ్రామానికి ఫైలెట్ కొంగలు వచ్చి వాతావరణ పరిస్థితులను గమనించుకుని వెళ్తాయి. తమ జీవికకు అంతా అనుకూలంగా ఉన్నట్లు భావిస్తే మిగతా కొంగల గుంపును మూడు విడతలుగా తీసుకువస్తాయి. ఇవి రెండు అడుగుల ఎత్తు ఉండే కాళ్లు, పెద్దపెద్ద రెక్కలు, నారింజరంగులో బారు ముక్కు, తల గూలాబి రంగులో, కాళ్లు,తోకబాగం, రెక్కలు, నలుపు, దేహం తెలుపుతో ముచ్చుగొల్పుతాయి. సైబీరియా అత్యంత శీతల ప్రదేశం కావడంతో కొంగలు అక్కడ సంతానోత్పత్తికి ఆటంకం ఏర్పడుతుండటుంది. దీంతో ఇక్కడికి వచ్చి చింతచెట్లపై ఆడ,మగ కలిసి గూళ్లను ఏర్పాటు చేసుకుని గుడ్లను పెట్టి పొదిగి పిల్లలను చేస్తాయి. పొరపాటున ఈ గూళ్లలోకి ఇతర మగ కొంగ వస్తే దానితో ఇందులోని మగ కొంగ తీవ్రస్థాయిలో ఘర్షన పడి దానిని వెల్లగొడుతుంది. అటు తర్వాత అవి ఏర్పాటు చేసుకున్న గూడును ఆడ,మగ కొంగలు విడిచివెలతాయి. వేరే గూడును ఏర్పాటు చేసుకుని,ఆడ కొంగ గుడ్లను పొదుగుతుంటే మగ కొంగ దానికి ఆహారం, నీటిని తీసుకువస్తూ రక్షణగా ఉంటుంది. పిల్లలు పుట్టిన తర్వాత వాటి ఆలన,లాలన ఎంతో ప్రత్యేకంగా ఉంటుంది. ఎండ వేడి తగలకుండా తమ పొడవాటి రెక్కలను అడ్డుగా ఉంచుతాయి. కుతికలో నీటిని దాచుకుని, అరకేజీపై బడిన చేపను నోట కరుచుకుని తెచ్చి పిల్లలకు అందిస్తాయి. పిల్లలు ఎదిగిన తర్వాత తమతో పాటు ఎంతదూరమైన ఎగరగలవు అని నిర్ధారించుకుని. సరిగ్గా ఆరు మాసాల అనంతరం తమ పిల్లలతో చింతపలిక్లి ప్రణమిల్లుతూ తమ దేశానికి

మిగతా 2లో..

# రైతు భరోసాలోనూ కోత

(మొదటిపేజీ తరువాయి)

రైతుల భూ విస్తీర్ణంలో పెరుగుదల వచ్చినప్పుడు మొత్తం ఆ సర్వే నెంబరులో ఉన్న రైతుల ఖాతాల్లో నగదు జమ చేయకుండా నిలుపు చేస్తున్నారని ఒక ఆరోపణ వినవస్తుంది. కానీ కొన్ని విషయాల్లో అది కూడా నిజం కాదని తేలిపోయింది. నేలకొండపల్లి మండలం రాజేశ్వరపురం గ్రామంలో బాగం ఉమా అనే రైతుకు 2.22 ఎకరాల భూమి ఉండగా ప్రభుత్వ లెక్కల ప్రకారం అది మొత్తం సాగు భూమిగానే నిర్ధారించారు. 2.22 ఎకరాలకు గాను రూ.15,300 జమ కావాల్సి ఉండగా కేవలం రూ.12,300 మాత్రమే జమ అయ్యాయి. ఆమెకు సంబంధించి సర్వే నెంబర్లలో కూడా భూ వివరాలను సక్రమంగానే నమోదు చేశారు. 2.22 ఎకరాల్లో వ్యవసాయేతర భూమి లేదని నిర్ధారించిన ప్రభుత్వం 1.02 ఎకరాలకు మాత్రమే రైతు భరోసా జమ చేశారు. ఇదే గ్రామానికి సంబంధించి పెద్దినేని వెంకటేశ్వర్లు అనే రైతుకు 1.05 ఎకరం భూమి ఉంది. ఈ మొత్తం భూమి వ్యవసాయానికి లాకి అయిన భూమిగానే నిర్ధారించారు. సర్వే నెంబరు 698/ఉ/2లో 0.25 ఎకరాలు, 696/ఆలో 0.20 ఎకరాలు ఉన్నట్లు నిర్ధారించారు. మొత్తం 1.05 ఎకరాలకు గాను రూ. 6,750 రైతు భరోసా పెద్దినేని వెంకటేశ్వర్లు ఖాతాలో జమ కావాల్సి ఉండగా కేవలం మూడువేలు మాత్రమే ఈనెల 10న జమ అయ్యాయి. పెద్దినేని వెంకటేశ్వర్లుకు ఈ భూమి తప్ప మరో భూమి లేదు. దాదాపు జిల్లాలో చాలా గ్రామాల్లో ఇదే తంతు కొనసాగుతుందన్న ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతుంది. రైతురుణమాఫీకి సంబంధించి కూడా లక్ష లోపు రుణం మంజూరు కాని వారు ఇప్పటికీ ఉన్నారంటే అతిశయోక్తి కాదు. కుటుంబ నిర్ధారణ జరగలేదని సాకులు చెప్పిన అధికారులు కుటుంబ నిర్ధారణ తర్వాత కూడా రుణమాఫీ ఎందుకు జరగలేదో చెప్పలేకపోతున్నారు. రూ. 70వేలు మాత్రమే రుణమున్న రైతుకు రూ. 45వేలు మాత్రమే రుణమాఫీ జరిగింది. రెండు లక్షల లోపు రుణమాఫీ జరిగినప్పుడు రూ. 70వేలు మాత్రమే ఉన్న రైతు రుణం ఎందుకు జరగలేదంటే బ్యాంకు అధికారులు సైతం సమాధానం చెప్పలేక ఇంతే జరిగింది మిగిలిన నగదు చెల్లించకపోతే నోటీసులు ఇవ్వాల్సి ఉంటుందంటూ హెచ్చరిస్తున్నారు. రైతుల విషయంలో ఎందుకు ఇలా జరుగుతుందో ప్రభుత్వం పునరాలోచన చేయాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే రైతు రుణమాఫీపై గందరగోళం నెలకొన్న నేపథ్యంలో రైతు భరోసానైనా సక్రమంగా రైతుల ఖాతాల్లో జమ అయ్యేవిధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# 18న రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన

**ప్రజాపక్షం/ఖమ్మం :** మిర్చి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 18న మంగళవారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్ వద్ద ఆందోళన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు లు తెలిపారు. ఈ ఏడాది మిర్చి రైతులు ధర లేక తీవ్రంగా నష్టపోతున్నారని ప్రభుత్వానికి ధర పెరుగుదల కోసం పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేదని తెలిపారు. మిర్చి బోర్డును ఏర్పాటు చేసి క్వింటాకు రూ. 25వేలు నిర్ణయించి మిర్చిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు పిలుపునిచ్చామని తెలిపారు. పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రమేష్, గోవిందరావు లు కోరారు.

# గిరిజనుల ఆరాధ్య దైవం సంత్‌శ్రీ సేవాలాల్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** గిరిజనుల ఆరాధ్య దైవం సంత్‌శ్రీ సేవాలాల్ మహారాజ్ అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శనివారం రఘునాథపాలెం జింకలతండా క్రాస్ రోడ్డు వద్ద గల సేవాలాల్ ఆలయం వద్ద సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి వేడుకల్లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బోగ్ బండారో కార్యక్రమంలో, అమ్మవారికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పూజలు నిర్వహించారు. అనంతరం సేవాలాల్ మహారాజ్ మందిర నిర్మాణానికి మంత్రి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సేవాలాల్ ఆశయ సాధనకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనలో కృషి చేస్తున్నామన్నారు. జగదాంబదేవి ఆశీస్సులు పొంది సేవాలాల్ గిరిజన దేవుడయ్యారన్నారు. గిరిజనుల అభ్యున్నతికి సేవాలాల్ చేసిన సేవలు ఎనలేనివన్నారు. అహింసా మార్గంలో నడుస్తూ సమాజాభివృద్ధి కోసం సేవాలాల్ చేసిన కృషి మరువలేనిదన్నారు. జంతుబలులు, మూఢనమ్మకాలు, చెడు వ్యసనాలకు లోనుకాకుండా మద్యం, మాంసం వంటివి ముట్టుకోకుండా ఉండాలని గిరిజనులను చైతన్యపరిచిన మహనీయుడు సేవాలాల్ అన్నారు. ప్రకృతిని పరిరక్షించాలని సేవాలాల్ పిలుపునిచ్చారన్నారు. సేవాలాల్ చూపిన మార్గంలో గిరిజనులు పయనించాలని కోరారు. ప్రభుత్వం సేవాలాల్ మహారాజ్ జయంతిని అధికారికంగా నిర్వహించడంతో పాటు ఆప్షనల్ హాలీడేను కూడా ప్రకటించిందన్నారు. మండలంలోని గిరిజనులు ఉద్యాన, కూరగాయలు, పండ్లు, పూల పంటల సాగు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మి నారాయణ, ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, కార్పొరేటర్లు లకావత్ సైదులు, కమర్తపు మురళి, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, సాధు రమేష్‌రెడ్డి, డిఎస్‌డివో సునీల్‌రెడ్డి, డిటిడివో విజయలక్ష్మి, ఏడి కోక్యా నాయక్, తహసీల్దార్ లూథర్ విల్సన్, రాము నాయక్, నంద్యా నాయక్, రాంబాబు నాయక్, జగ్యానాయక్, మంగ్యానాయక్, ఉపేందర్, కృష్ణ, దీప్లానాయక్, దేవ్‌సింగ్, కోటేష్, రామ్మూర్తి, పలువురు గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

# వి'హంగమా' నీవెక్కడ..!?

(మొదటిపేజీ తరువాయి)

తిరుగు ప్రయాణమవుతాయి. ఈ క్రమంలో కొంగలు ఏర్పాటు చేసుకున్న గూళ్లను సైతం తొలగించిమరి వెళ్లిపోతాయి.

### చిన్నబోయిన చింతపల్లి...

సైబీరియా నుంచి వేల కిలోమీటర్లు ప్రయాణించి ఇక్కడకు చేరుకునే కొంగలకు ఎటువంటి ప్రాణభయం లేకుండా గ్రామస్థులే కట్టుబాట్లు విధించుకున్నారు. కొంగలు పొలాల్లో, చెరువు గట్లపై వాలినప్పుడు వాటికి హాని తలపెట్టడం, గూళ్లపై వాలినప్పుడు వాటిని పట్టుకోవడం, చంపడం భయభ్రాంతులకు గురిచేయడం, వేటాడి భూజించడం వంటివి ఎవరు చేసిన గ్రామ బహిష్కరణ చేస్తారు. ఇతర ప్రాంతాల నుండి వచ్చే ప్రజలు ఇటువంటి చర్యలకు పాల్పడితే దేహశుద్ధి చేసి మరీ పోలీసులకు అప్పగిస్తారు. తమ ఊరికి పురుడుపోసుకోవడానికి ఆడబిడ్డలే కాన్పుకువస్తాయిని భావించి ప్రత్యేక రక్షణ కల్పిస్తారు. కొంగలు రాకుంటే అశుభంగా భావించే ప్రజలు ఆ సెంటిమెంట్‌తో కరువు వస్తుందేమోనని ప్రస్తుతం కలవరం చెందుతున్నారు.

### రక్షణ చర్యలు శూన్యం...

2017నుంచి తమ ఆధీనంలోకి తీసుకొని ఏకో టూరిజంగా గుర్తిస్తూ అటవీశాఖ ఆధ్వర్యంలో బోర్డులను సైతం ఏర్పాటు చేశారు. అలాగే ఫారెస్ట్ తరుపున పర్యటకులు, ప్రభుత్వ ఆఫీసర్లకు కొంగల విషిష్టతను తెలిపేందుకు రామకృష్ణ అనే యువకుడిని గైడ్‌గా నియమించారు. 2019లో బర్డ్స్ ఫెస్టివల్ చేసి 2కె రన్‌ను నిర్వహించారు. వీటన్నింటిని డిఎఫ్‌ఓ సునీల్‌కుమార్ హిరేమత్ ప్రత్యేక దృష్టి ద్వారా జరిపించారు. అంతేకాకుండా కోతులను పట్టుకునేందుకు క్యాచ్చర్‌ను ఏర్పాటు చేశారు. ఒకవేళ చెట్టుపైన నుంచి పడిన పక్షులకు గైడ్ చికిత్స సాయం అందిచేవాడు. కానీ 2021లో ఆ డిఎఫ్ఓ బదిలిపై వెళ్లడంతో అధికారులు పట్టించుకోలేదు. దీంతో కొంగల రక్షణ కల్పించడం, చర్యలను చేపట్టడంలో జాప్యం వహిస్తునేఉన్నారు.

### అధికారులు పట్టించుకోలేదు..

**తోట బిక్షమయ్యా, సిపిఐ నాయకులు(గ్రామస్తుడు)**



అటవీ అధికారులు కొత్తలో ఏదో హడావుడి చేసి, అటు తర్వాత పట్టించుకోలేదు. దీంతో కోతులు విపరీతంగా పెరిగి గూళ్లలోని వాటి గుడ్లను పగలగొట్టుకునే తాగేవి. చెట్లపైనే ఉంటూ గూళ్లపై కొంగలను వాలకుండా భయభ్రాంతులకు గురి చేసేవి. ఇండ్లపైన ఉన్న చెట్లమీద కొంగలు ఉండటంతో రెట్ట వేసి వాసన వచ్చేది. అధికారులు శానిటేషన్ చేపించేవారు కాదు. ఇలా అధికారుల తప్పిదాలతో కొంగలు దూరం అయ్యాయి.

# జనాభా ప్రకారమే బిసిలకు రిజర్వేషన్లు కల్పించాలి



(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం తప్పుడు లెక్కలు చూపినా 46 శాతం బిసిలు ఉన్నారని రీ సర్వేలో మరో రెండు శాతం పెరిగే అవకాశం ఉందని ఆమె అన్నారు. 48 శాతం బిసిలు ఉంటే 42 శాతం రిజర్వేషన్లు ఎందుకు కేటాయించాలని ఆమె ప్రశ్నించారు. ముస్లింలు, బిసిలకు కలిపి 56 శాతం రిజర్వేషన్లను ప్రతిపాదించారు. గ్రామాల వారీగా ఏ కులంలో ఎంత జనాభా ఉందో ప్రభుత్వం బయట పెట్టాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వం బిసిల అభివృద్ధికి ఎంతగానో కృషి చేసిందని పార్టీ పదవుల్లో బిసిలకు 51 శాతం అవకాశాలు కల్పించారని గుర్తు చేశారు. బిసి రిజర్వేషన్‌లకు రాజ్యాంగ రక్షణ కమిటీ ఉంటే ఎంతో అభివృద్ధి చెందేదన్నారు.

### అక్రమ కేసులకు తలొగ్గేది లేదు...

కాంగ్రెస్ పార్టీ పెట్టే అక్రమ కేసులకు తలొగ్గేది లేదని కవిత స్పష్టం చేశారు. ఎస్సి, ఎస్టి అట్రాసిటీ కేసులో ఖమ్మం జైలులో ఉన్న బిఆర్ఎస్ నాయకుడు లక్కినేని సురేందర్‌ను ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిపాలన చేతకాక ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు పెడుతున్నారని తగు సమాధానం ప్రజలే చెబుతారని కవిత తెలిపారు. వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. అంతకు ముందు సేవాలాల్ సంత్ జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బిఆర్ఎస్ నాయకులు, ఎంపి వద్దిరాజు రవిచంద్ర, నగర బిఆర్ఎస్ అధ్యక్షులు పగడాల నాగరాజు ఇంటికి వెళ్లిన కవిత పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కవితతో పాటు ఎంపి వద్దిరాజు రవిచంద్ర, ఎంఎల్‌సి తాతా మధు, బిఆర్ఎస్ నాయకులు లింగాల కమల్‌రాజు, మాజీ ఎంఎల్ఏలు బానోత్ మదన్‌లాల్, హరిప్రియా నాయక్, కూరాకుల నాగభూషణం, ఆర్‌జెసి కృష్ణ, బొమ్మెర రామ్మూర్తి తదితరులు వున్నారు.

# అక్రమ రేషన్ బియ్యం పట్టివేత

## -రెండు వాహనాలు, ఐదు టన్నుల బియ్యం స్వాధీనం




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** తెలంగాణ నుండి ఆంధ్రాకు తరలుతున్న సుమారు 5 టన్నుల రేషన్ బియ్యాన్ని, బియ్యాన్ని తరలించేందుకు ఉపయోగించిన రెండు వాహనాలను నియోజకవర్గ పరిధిలోని పెనుబల్లి ఎస్ఐ వెంకటేష్ తన సిబ్బందితో మాటు వేసి పట్టుకుని కేసులు నమోదు చేసిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. సివిల్ సప్లై డిటి సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని నుండి కుప్పెనకుంట్ల వెళ్లే మార్గంలో రేషన్ బియ్యం లోడ్ చేస్తున్నారని విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీస్‌లు దాడులు నిర్వహించగా ఏపీ 39 టీ వై 1851 అను వాహనంలో 16 బస్తాలు ఏపీ 39 యూహెచ్ 9514 అను వాహనంలో 98 బస్తాలు అక్రమ రేషన్ బియ్యం ఉండడంతో బియ్యాన్ని, వాహనాలను స్వాధీనం చేసుకుని తనకు సమాచారం అందించారన్నారు. పట్టుబడిన రెండు వాహనాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం జయంతి గ్రామానికి చెందిన కే. సత్యనారాయణ, కే మల్లిఖార్జున రావు పేర్లపై ఉన్నాయన్నారు. వాహనాల డ్రైవర్లు ఇనపనూరి పున్నారావు, పర్సా రవిలపై 6ఏ కేసులు నమోదు చేసామని తెలిపారు. బియ్యం ఎక్కడి నుండి ఎక్కడికి తరలిస్తున్నారు. ఎవరి వద్ద కొనుగోలు చేశారు. దీని వెనుక సూత్రదారులెవరూ తదితర విషయాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# శివ మాలాదారుల పాదయాత్ర

**ప్రజాపక్షం/కూసుమంచి :** మండల కేంద్రంలోని శనివారం శివమాలధారులు కూసుమంచి నుండి జీల చెరువు వరకు పాదయాత్ర నిర్వహించారు. కూసుమంచిలోని శ్రీ గణేశ్వర ఆలయం నందు ప్రతి సంవత్సరం మహాశివరాత్రి మహోత్సవాన్ని నిర్వహిస్తున్న క్రమంలో ఈ సంవత్సరం మహాశివరాత్రి ఘనంగా నిర్వహించుకొనుటకు భక్తులు వందలాదిమంది శివమాలలు ధరించి 45 రోజులు ఉపవాస దీక్షలతో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. అందులో భాగంగానే శనివారం నాడు గురు స్వామి చెన్నా మోహన్ నేతృత్వంలో చెన్నా మోహన్ రావు నేతృత్వంలో వందలాదిమంది శివమలదారులు కూసుమంచి నుండి జీలచెరువు శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా డీజే మేల తాళాలతో భక్తులు ఘనంగా భక్తిశ్రద్ధలతో పాదయాత్రలో పాల్గొన్నారు. ప్రజలు ఎంతో ఆదరించారు.




# మైనారిటీ విద్యార్థుల సంక్షేమానికి నిధులు కేటాయించండి : ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** తెలంగాణ సచివాలయంలో మైనారిటీ సంక్షేమం ప్రధాన కార్యదర్శి తఫ్సీర్ ఇక్బాల్ ని శనివారం సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ విజయకుమార్ మర్యాదపూర్వంగా కలుసుకుని మైనారిటి విద్యార్థుల సంక్షేమం, అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని కోరారు. సత్తుపల్లి నియోజకవర్గంలోని మైనారిటీ స్కూల్ డెవలప్మెంట్, మైనారిటీల సామాజిక ఆర్థికాభివృద్ధి, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థుల కోసం విద్యాపరమైన రాయితీలకు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

# సమాజాభివృద్ధిలో కీలకంగా ఉండాలి



**-మాజీ మంత్రి పువ్వాడను కలిసిన కమ్మ సంఘం నేతలు**

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్:** సమాజాభివృద్ధిలో కమ్మ మహాజన సంఘం కీలకంగా ఉండాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికైన కమ్మ మహాజన కమిటీ సభ్యులు శనివారం మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పువ్వాడ మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో కమ్మ సంఘం సభ్యులు కీలకంగా ఉండాలన్నారు. ఎక్కడ ఎటువంటి పొరపాట్లు జరగకుండా సంఘం అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలన్నారు. రాజకీయాలకు అతీతంగా నూతనంగా ఏర్పడిన కమిటీ మంచిగా పనిచేసి భవిష్యత్తు తరాలకు మార్గదర్శకంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా కమిటీ సభ్యులు సిపిఎం మాజీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేనివీరభద్రం, సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావును మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు కొల్లు రఘు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి చావా రాము, వైస్ ప్రెసిడెంట్ కర్నాటి రమాదేవి, జాయింట్ సెక్రటరీ వజ్జా శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు కోలేటి నవీన్, మేదరమెట్ల స్వరూపరాణి, నంబూరి ప్రసాద్, పోతినేని భూమేశ్వరరావు, తుమ్మలపల్లి నాగేశ్వరరావు, కో ఆప్షన్ సభ్యులు తాళ్లూరి మురళికృష్ణ, బండి రవికుమార్, నాయకులు వల్లభనేని రామారావు, చిరుమామిళ్ల నాగేశ్వరరావు, జశ్వంత్, చీకటి వెంకటప్పారావు తదితరులు ఉన్నారు.

# చిరస్మరణీయుడు ధర్మభిక్షం

**-జయంతి సందర్భంగా ఘన నివాళి**



**ప్రజాపక్షం/ఖమ్మం :** జీవిత కాలం పేదల అభ్యున్నతి కోసం గీతపనివార్ల హక్కుల కోసం పోరాడిన తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎంపి బొమ్మగాని ధర్మభిక్షం చిరస్మరణీయుడని గీతపనివార్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు తొండల సత్యనారాయణ, దూసరి శ్రీరాములు తెలిపారు. యుక్త వయస్సులోనే వామపక్ష భావాన్ని అలవర్చుకున్న ధర్మభిక్షం చివరి వరకు కమ్యూనిస్టు పార్టీ నాయకునిగా, ఎర్ర జెండా నీడలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారన్నారు. ధర్మభిక్షం 103వ జయంతి సందర్భంగా ఖమ్మం వన్‌టౌన్ సిపిఐ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ, శ్రీరాములు మాట్లాడుతూ ఆల్ హైదరాబాద్ స్టూడెంట్ ఫెడరేషన్‌లో చేరిన ధర్మభిక్షం నాటి నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జరిగిన అనేక పోరాటాలకు నేతృత్వం వహించారన్నారు. నిమ్న వర్గాలకు ఉన్నత విద్యను అందించే లక్ష్యంతో హాస్టల్ స్థాపించాడని వారు తెలిపారు. మూడుసార్లు ఎంఎల్ఏగా, రెండు సార్లు నల్లగొండ ఎంపిగా గెలుపొందిన ధర్మభిక్షం నిజాయితీకి నిలువెత్తు రూపంగా నిలిచారన్నారు. గీతపనివార్ల హక్కుల కోసం, సంక్షేమం కోసం ఆయన తన పోరాటాన్ని తుది శ్వాస వరకు కొనసాగించారన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు, పగడాల మల్లేష్, గీతపనివార్ల సంఘం నాయకులు కె. వాసు, సిపిఐ నాయకులు మాడుగుల నాగేశ్వరరావు, మాలకొండయ్య, కంపసాటి వెంకన్న, నర్సింహారావు, ఎస్. కోటేశ్వరరావు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# మిరపకు గిట్టుబాటు ధర కల్పించాలి

**ప్రజాపక్షం/ తల్లాడ :** రాష్ట్ర ప్రభుత్వం మిర్చి పంటకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం నాయకులు అయినాల రామలింగేశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం తల్లాడ మండలంలో పలు చోట్ల తెలంగాణ రైతు సంఘం తల్లాడ మండల కమిటీ ఆధ్వర్యంలో మిర్చి కల్లాల వద్ద రైతులను కలిసి వారి సమస్యలను తెలుసుకోవటం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక ఎకరం మిర్చి పండించడానికి సొంత భూమి ఉంటే రూ.25వేలకు పైగా ఖర్చు అవుతుందని, కౌలు రైతులకు అదనంగా కౌలు ఉంటుందని అనేక ప్రకృతి వైపరీత్యాలు చీడపీడలు తట్టుకుని ఆరుగాలం శ్రమించం పడించిన పంటకు గిట్టుబాటు లేకపోవడంతో రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఏర్పడిందని తన ఆవేదనను వ్యక్తం చేశారు. ఒక్కొక్క ఎకరానికి 15క్వింటాళ్ల లోపు మాత్రమే దిగుబడి వస్తుందని, క్వింటాకు రూ.13వేలు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని, దీంతో రైతులు తీవ్ర నష్టాన్ని చవిచూడాల్సి వస్తుందన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి క్వింటాకు రూ.25వేలు మద్దతు ధర ప్రకటించి కొనుగోలు చేసి రైతులు



ఆదుకోవాలని కోరారు. మిర్చి రైతుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 18న నిర్వహించ తలపెట్టిన కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను మిరప రైతులు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి నల్లమోతు మోహన్‌రావు, పులి వెంకటనర్సయ్య, కొమ్మినేని వెంకటేశ్వరరావు, సూద హన్మంతరావు, చెన్ను భాస్కర్, గోవింద్ వీరయ్య, మాగం వెంకటేశ్వర్లు, సుంకర నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# పెరుగుతున్న సింగరేణి బాధితులు.. కొనసాగుతున్న దీక్షలు





**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సైలో బంకర్ నిర్మాణంతో తమ ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయంటూ అంబేద్కర్ నగర్, బీసీ కాలనీ వాసులు ఓ పక్క ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తుండగానే, మరో ఇద్దరు బాధితులు సింగరేణి బారిన పడి ఆసుపత్రి పాలయ్యారు. మండల పరిధిలోని కిష్టారం గ్రామపంచాయతీ అంబేద్కర్ నగర్, బీసీ కాలనీకి చెందిన ప్రజలు గత ఆరు రోజులుగా సైలో బంకర్ పక్కన టెంట్లు వేసుకొని రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తూనే ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే శనివారం అంబేద్కర్ నగర్ కు చెందిన మారోజు శ్రీదేవి, పానెం పుల్లమ్మ అనే ఇద్దరు మహిళలు ఉదయం అస్వస్థత గురికాగా సత్తుపల్లి ప్రభుత్వాసుపత్రికి అబులెన్స్ ద్వారా తరలించారు. పరీక్షించిన వైద్యులు ప్రస్తుతం వారి ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు. మారోజు శ్రీదేవి కాళ్లు, చేతులు వాపుతో యూరిన్ ఇన్ఫెక్షన్‌తో బాధపడుతుందని వైద్యులు తెలిపారు. సింగరేణి పొల్యూషన్ బారిన పడిన ఇద్దరు మహిళలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని తెలుసుకున్న పిఓ నరసింహారావు మధ్యాహ్నం శ్రీదేవిని పరామర్శించి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులను ఆమె ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకుని మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులను కోరారు. ఆగ్రహం వ్యక్తం చేసిన బాధితులు రోజు, రోజుకు బాధితుల సంఖ్య పెరుగుతుందని అయినా మా వైపు నాయకులు, అధికారులు కాని కన్నెత్తి చూడడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అగ్రవర్ణాలైతేనే పరామర్శిస్తారా పేదలను పరామర్శించడం అంటూ మండిపడ్డారు. పరిస్థితి ఇదే విధంగాఉంటే రానున్న రోజుల్లో ఉద్యమాన్ని ఉదృతం చేసి సింగరేణిని స్తంభింప చేస్తామని హెచ్చరించారు.

# ప్లాస్టిక్ వాడుతున్న వ్యాపారులకు జరిమానాలు





**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వాడుతున్న పలువురు వ్యాపారులకు ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు జరిమానాలు విధించారు. శనివారం ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని గట్టయ్య సెంటర్‌లో కమర్షియల్ షాప్స్, హోటల్స్, కిరాణా అండ్ జనరల్ స్టోర్స్, టీ, పాన్‌షాపుల్లో మున్సిపల్ అధికారుల తనిఖీలు నిర్వహించి 34 కేజీల సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పట్టుకున్నారు. ఆ వ్యాపారులకు రూ. 14 వేల జరిమానా విధించారు. నిషేధ సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను ఎవరు వాడవద్దని సూచించారు. వాడిన వారిపై జరిమానాలు విధించడంతో పాటు చట్టరీత్యా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని అధికారులు తెలిపారు.

# కార్గో కేంద్రాల నిర్వహణకు టెండర్ల ఆహ్వానం

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** మధిర, వైరా, వియం బంజర బస్టాండ్లలో టిజిఎస్ ఆర్టీసి లాజిస్టిక్స్ (కార్గో) కేంద్రాలను నడుపుటకు టెండర్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి కరీంనగర్, వరంగల్, ఖమ్మం లాజిస్టిక్స్ మేనేజర్ రామారావు శనివారం తెలిపారు. లాజిస్టిక్స్ పాయింట్ నడుపుటకు కంప్యూటర్, ప్రింటర్, వేయింగ్ మిషన్ కలిగి ఉండి ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 24న ఖమ్మం రీజినల్ మేనేజర్ కార్యాలయం ఖమ్మం పాత బస్టాండ్ నందు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల లోపు టెండర్లు దాఖాలు చేయాలన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో http://tsrtc.telangana.gov.in వైబ్ సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

# ఘనంగా సంత్‌సేవాలాల్ 286వ జయంతి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మంరూరల్ మండలంలోని ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో గల పెద్దతండలో బంజారాల ఆరాధ్యదైవం సంత్‌సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. దీనికి గ్రామాలలోని పలువురు బంజార పెద్దలు హాజరై చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే బెల్లం, బియ్యం, పప్పు, నెయ్యిని ఉపయోగించి తయారు చేసిన పదార్థాలను నైవేద్యంగా సమర్పించారు. ఈ కార్యక్రమంలో బంజారా నాయకులు బానోత్ రాంకోటి, ఫారెస్ట్ రామ్మూర్తి, గడ్డానాయక్, బానోత్ కిషోర్, బానోత్ రాంచంద్రునాయక్, మూడ్ నారాయణ, బోడ వీరన్న, బానోత్ జగన్, పాల్తీయ శ్రీను, బానోత్ వెంకన్న, సత్యనారాయణ, బిక్షం, దేప్లా, బాలాజీ, సిపిఐ జిల్లా సమితి సభ్యులు చెరుకుపల్లి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# తాండ్ర వినోద్‌ను కలిసిన బిజెపి నాయకులు



**ప్రజాపక్షం/తల్లాడ :** బిజెపి రాష్ట్ర నాయకులు తాండ్ర వినోద్‌రావును తల్లాడ మండల బిజెపి అధ్యక్షులు చల్లా నాగులు, మండల నాయకులు రాయల రమేష్, పులి వెంకటేశ్వరరావు, ఆవుల వేణు, చౌడ నాగేశ్వరరావు, కటికి నర్సింహారావు, మంగరాయ రామకృష్ణ తదితరులు కలిశారు. త్వరలో జరుగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా శనివారం ఖమ్మం క్యాంపు కార్యాలయంలో కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించటం జరిగింది. ప్రస్తుతం తెలంగాణ బిజెపికి అనుకూల వాతవరణ ఉందని, నరేంద్రమోడీ చేపడుతున్న కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని తాండ్ర వినోద్‌రావు నాయకులకు సూచించారు. తల్లాడలో యువకులు బిజెపి వైపు ఆకర్షితులవుతున్నారని, కాంగ్రెస్‌పై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని మండల నాయకులు వివరించారు.

# ఆసుపత్రిలో సాధారణ కాన్పులు పెంచాలి



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు లోని ప్రభుత్వాసుపత్రిలో సాధారణ కాన్పులు సంఖ్య పెంచాలని జిల్లా, వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ కళావతి భాయి కల్లూరు ప్రభుత్వ వైద్యాధికారి నవ్యకాంత్ కు ఆదేశించారు. కల్లూరు లోని ప్రభుత్వ వైద్యశాలను శనివారం ఆకస్మిక తనిఖీని నిర్వహించి పరిసరాల పరిశుభ్రత, రికార్డులు పరిశీలన,హాజరు పట్టిక, వ్యాక్సిన్ గది, నిర్వహణ, ల్యాబ్ పరిశీలన, మందుల గది, రికార్డు నిల్వలను పరిశీలించి పలు సలహాలు, సూచనలు ఆదేశాలు ఇచ్చారు. వైద్యులు సిబ్బంది స్థానికంగా ఉండి సేవలు అందించాలని ఆరోగ్య కార్యక్రమాలు గ్రామాలలో క్యాలెండర్ ప్రకారం నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షకులు రామారావు ఆరోగ్య విస్తరణ అధికారి సత్యనారాయణ, డివిజనల్ జనన మరణ ధృవీకరణ అధికారి చార్లెస్, జూనియర్ అసిస్టెంట్ రవి, ఫార్మసిస్ట్ అనూష, సిబ్బంది పాల్గొన్నారు.

## పెరుమాళ్ళ కుటుంబ సభ్యులకు పరామర్శ



**ప్రజాపక్షం/జూలూరుపాడుః** జూలూరుపాడు మండల కేంద్రానికి చెందిన పెరుమళ్ళ శ్రీనివాస్ మాతృమూర్తి పెరుమళ్ళ నరసింహరత్నం దశ దినకర్మ శనివారం నిర్వహించగా కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొని నరసింహ రత్నం చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు యల్లంకి సత్యనారాయణ, మాజీ మండల అధ్యక్షుడు చావా వెంకటరామారావు, సొసైటీ డైరెక్టర్ చాపలమడుగు రామ్మూర్తి, మద్దిశెట్టి ప్రకాష్, తాళ్లూరి రామారావు, బానోత్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి



**ప్రజాపక్షం/జూలూరుపాడుః** జూలూరుపాడు మండలం సూరారం గ్రామపంచాయతీ లో శనివారం శ్రీశ్రీశ్రీ సంత్ గురు సేవాలాల్ మహరాజ్ 286వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాలాల్ సేన జూలూరుపాడు మండల అధ్యక్షులు బానోత్ లక్ష్మణ్ నాయక్ మహరాజ్ చిత్రపటానికి పూలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బానోత్ హరి లాల్, కుర్ర నాగ్య, గూగుల్, రామ గూగుల్, వెంకటేష్ నాయక్, కుర్ర కిరియ, కిట్ట ధరావత్, రమేష్, మాలోత్ రాములు, సేవాలాల్ సేన నాయకులు యువకులు పాల్గొన్నారు.

## ఆదివాసి ఉద్యోగులు ఏం పాపం చేశారు...?



**ప్రజాపక్షం/కరకగూడెంః** తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాల బంజారా ఉద్యోగులకు గత మూడు సంవత్సరాల నుండి సంత్ సేవాలాల్ మహారాజ్ బంజారాల ఆరాధ్య దైవం పుట్టిన రోజు సందర్భంగా ప్రతి సంవత్సరం ది. 152 2025 న రాష్ట్ర ప్రభుత్వం వారు లంబాడీలకు ప్రత్యేకమైన సెలవు ఇవ్వడం దుర్మార్గమైన చర్యగా ఆదివాసీ సంఘాలు ప్రకటించాయి. ఈ సందర్భంగా ఆదివాసి జెఎసి మండల అధ్యక్షుడు పోలెబోయిన వెంకటనారాయణ మాట్లాడుతూ ఆదివాసీల ఆరాధ్య దైవమైన ఆదిపరాశక్తి సమ్మక్కకు లేని సెలవు కులగురువులకు ఎందుకు అని ప్రశ్నించారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం డిసెంబర్ 9వ తేదీకి లేని ప్రత్యేకత సేవాలాల్ జయంతికి ఎందుకు ఇస్తున్నారు పరిపాలించే నాయకులకు అర్థం కావలసిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కరకగూడెం మండల ఆదివాసి జెఎసి ప్రధాన కార్యదర్శి కలం సాంబమూర్తి, కమిటీ సభ్యులు పోలెబోయిన కార్తీక్ , కలం నాగకృష్ణ, కలం సంపత్ , పోలెబోయిన రాజు, సుతారి నాగేశ్వరరావు, ఊకే నరేష్ , చందా అశోక్, పోలెబోయిన సత్యనారాయణ, కొమరం సాంబశివరావు, పోలెబోయిన కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సహజ యోగ ధ్యానంతో ప్రశాంతత సాధ్యం



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** సహజ యోగ ధ్యానంతో ప్రశాంతత సాధ్యమవుతుందని సహజ యోగ తెలంగాణ ట్రస్టు రాష్ట్ర కోఆర్డినేటర్ గౌరీకృష్ణ అన్నారు. మండల కేంద్రమైన బూర్గంపాడు ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సహజ యోగ ధ్యానం ప్రతి మనిషిలో ఉన్న కుండలిని, మనల్ని సృష్టించిన దైవ శక్తితో అనుసంధానం చేసే పరిపూర్ణ ధ్యాన ప్రక్రియ అని దీని ద్వారా ప్రతి ఒక్కరూ ఆత్మసాక్షాత్కారం పొందుతారన్నారు. ఈ సహజ యోగంబించుకోవడం వల్ల మానసిక ప్రశాంతతో పాటు చెడు అలవాట్లకు దూరంగా ఉండటం సాధ్యమవుతుందన్నారు. బూర్గంపాడు మండలంలోని సారపాక, మోరంపల్లిబంజర్, నాగినేనిప్రోలురెడ్డి పాలెం, బూర్గంపాడు తదితర గ్రామాల్లో సహజ యోగాపై ప్రజలకు అవగాహన కల్పించినట్లు ఆయన తెలిపారు. ఈసమావేశంలో సహజ యోగ తెలంగాణ ట్రస్ట్ రాష్ట్ర కమిటీ సభ్యులు సుప్రజ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇన్చార్జ్ కోఆర్డినేటర్ అశ్విన్, కమిటీ సభ్యులు అమర్‌సింగ్, రాజు, నవీన్ పాల్గొన్నారు.

## విద్యుత్ శాఖ పొలంబాట



**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు మండలం పెద్ద కోరుకొండి విద్యుత్ శాఖ అధికారి శీలం రామ్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం తెలగవరం గ్రామంలో విద్యుత్ శాఖ పొలంబాట నిర్వహించారు. దాని ద్వారా నష్టాలు కూడా ఉన్నాయని దాని పట్ల అప్రమత్తంగా ఉండాలని పలు జాగ్రత్తలు సలహాలను పాటించాలని రైతులకు సూచించారు. విద్యుత్తును పొదుపుగా వాడాలని, వృధా చేయవద్దని, పొదుపుగా వాడితే రాబోయే రోజులకు ఉపయోగకరంగా ఉంటుందని, వృధా చేస్తే భవిష్యత్తుకు నష్టముగా ఉంటుందని విద్యుత్ శాఖ అధికారి రైతులకు మరియు తెలగవరం గ్రామ ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో హరీష్ తోపాటు ఏఎల్ఎం, జేఎల్ఎంలు, పలువురు రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పంట రుణం కింద ఫిక్స్‌డ్ డిపాజిట్ జమ..!

### బెదిరించారని బ్యాంక్ మేనేజర్‌పై పోలీసులకు ఫిర్యాదు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లోని మోటాపురం గ్రామానికి చెందిన నంబూరి నారాయణ, రాజేశ్వరపురం బ్యాంక్ లో 202122 లో రూ.55 వేల పంట రుణం తీసుకున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా 2022 లో భూమిని విక్రయించారు. కాగా ఈ నెల తన వృద్ధాప్య పెన్షన్ డబ్బుల కోసం బ్యాంక్ కు వెళ్లితే ఫించన్ ను ఇవ్వటానికి నిరాకరించాడని తెలిపారు. కారణం పంట రుణం చెల్లించాలని డిమాండ్ చేశారు. అంతే కాకుండా బెదిరించారని వాపోయాడు. పంట రుణం కు ఫించన్ డబ్బులు ఇవ్వటానికి సంబంధం లేదని వాదించటంతో ఫించన్ ను చివరకు అందించారు. కాగా ఎటువంటి అధికారిక నోటీసులు ఇవ్వకుండా బకాయి ఉన్న పంటరుణం ను కియర్ చేయాలని తనను ఒతిడి చేశారనిఆరోపించారు. పంట రుణం క్లియర్ చేయటానికి బ్యాంక్ లో దాచుకున్న ఫిక్స్ డిపాజిట్ రూ.55 వేలను బ్యాంక్ ఖాతాలోకి మార్చుకున్నారని వాపోయారు. బకాయిలు చెల్లించేందుకు కనీసం వన్ టైమ్ సెటిల్ మెంట్ అవకాశం ఇవ్వకుండా నిబంధనలకు విరుద్ధంగా ఫిక్సిడ్ డిపాజిట్ ను బలవంతంగా సంతకాలు తీసుకుని డబ్బులను జమ చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ఇలా ఉండగా... తమ కుమారుడు బ్యాంక్ అధికారులకు ఫిర్యాదు చేసినందుకు తన ఇంటిలోకి దౌర్జన్యం గా చోరబడి బెదిరించారని స్థానిక పోలీసే స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సమగ్రంగా విచారించి తగిన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని వేడుకున్నారు. వృద్ధుడు ను బెదిరించిన మేనేజర్ పై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని మోటాపురం సోసైటీ మాజీ డైరెక్టర్ రావెళ్ల కృష్ణారావు డిమాండ్ చేశారు. ఈ విషయం పై ఎస్బీఐ బ్యాంక్ మేనేజర్ టి.నాగేందర్ ను వివరణ కోరగా తాము ఏమీ బలవంతం చేయలేదని... అతని ఇష్ట ప్రకారమే ఫిక్సడ్ డిపాజిట్ ను జమ చేసుకున్నట్లు పేర్కోన్నారు. తాము ఎవరని బెదిరించలేదన్నారు. పెన్షన్ విషయంలో కూడ ఇబ్బంది పెట్టలేదన్నారు.

## నేటి టియుసిఐ జిల్లా మహాసభను జయప్రదం చేయండి




**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** కొత్తగూడెం, ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా టియుసిఐ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం కొత్తగూడెం టియుసిఐ ఆఫీసు నందు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, ఆర్.మధుసూదన్ రెడ్డి, షేక్ యాకుబ్ షావలి, పాల్గొని మాట్లాడుతూ, జిల్లా మహాసభ ఆదివారం కొత్తగూడెం ఉర్దూగర్ ఫంక్షన్ హాల్ లో జరుగుతుందన్నారు. ప్రారంభ ఉపన్యాసకులుగా, ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య గారు, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ముద్దా బిక్షం, ప్రధాన వక్తగా, టియుసిఐ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.సూర్యం పార్టీ కొత్తగూడెం డివిజన్ కార్యదర్శి జాటోత్ కృష్ణ, పాల్గొని ప్రసంగిస్తారని అన్నారు. ప్రధానంగా జిల్లాలో కార్మిక పునాది కలిగినటువంటి ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా, టియుసిఐ నూతన కార్మిక సంఘమైనప్పటికీ, ఈ జిల్లా పారిశ్రామిక ప్రాంతమైనటువంటి మణుగూరు కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లందు, గుండాల ,ఆళ్ళపల్లి ,తదితర మండలాల్లో కార్మికుల సమస్యల కోసం నిరంతరం పోరాడుతుందన్నారు. ఈ మహాసభకు సింగరేణి, మున్సిపల్, గ్రామపంచాయతీ, కేటీపీఎస్, బిటిపిఎస్, కెమికల్ ఫ్యాక్టరీలు, ఆటో అండ్ మోటార్, ప్రభుత్వ ఆసుపత్రులు, కస్తూరిబాగాంధీ, భవన నిర్మాణం,హమాలీ తదితర కార్మికులు పాల్గొంటున్నారని అన్నారు. ప్రధానంగా మోడీ కార్మివిధానాలకు వ్యతిరేకంగా చట్టసవరణలకు వ్యతిరేకంగా, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం కొరకు కనీస వేతనం 26,000 ఇయ్యాలని, ముఖ్యమంత్రి హామీ ప్రకారం, తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ రంగం, సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచే విధంగా ఈ ప్రభుత్వంపై ఒత్తిడి చేసి పోరాటాలకు సిద్ధం కావాలని అన్నారు. పోరాట కర్తవ్యాలను రూపొందించు కోవాలన్నారు. ఈ మహాసభలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి గోపాలరావు కోశాధికారి పెద్దబోయిన సతీష్, జిల్లా నాయకులు రాజశేఖర్ సుందర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## నేటి నుండి లింగమంతుల స్వామి జాతర





**ప్రజాపక్షం/మణుగూరుః** మణుగూరు సరిహద్దు రేగులగండి అటవి ప్రాంతంలో యాదవుల కుల దైవంగా పేరొందిన లింగమంతుల జాతరకు భక్తులు తండోపతండాలుగా తరలివస్తుంటారు. ఈ నెల 16 ఆదివారం నుండి 18 మంగళవారం వరకు మూడు రోజులపాటు జరిగే ఈ జాతరకు మణుగూరు, అశ్వాపురం మండలాల నుంచి కాకుండా భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాల నుండి వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తమ మొక్కులను చెల్లించుకుంటారు. లింగమంతుల స్వామి యాదవుల ఆరాధ్య దైవం జాతరకు ఎడ్ల బండ్లు, ఆటోలు, ట్రాక్టర్లపై అక్కడ చేరుకుంటారు. మగవాళ్లు ఎరుపు రంగు గజ్జెల లాగు ధరించి, కాళ్ళకు గజ్జెలు కట్టుకొని చేతిలో ఆవు సరాలు పట్టుకొని డిల్లెం, బల్లెం శబ్దాల నడుమ లయబద్ధంగా నడుస్తూ ఓ లింగా... ఓ లింగా.. అంటూ హోరెత్తిస్తారు. మహిళలు తడి బట్టలతో పసుపు, కుంకుమ, పూల దండలు, అగరబత్తీలతో అలంకరించిన మంద గంపను నెత్తిన పెట్టుకొని నడుస్తారు. సంతానం లేని మహిళలు బోనం గంపను ఎత్తుకుంటారు. తోడుగా వచ్చిన వాళ్లు దేవుడికి బలిచ్చే గొర్రె పొట్టేలును తీసుకొస్తారు. అక్కడికి రావడానికి ముందుగానే గొర్రె పొట్టేలుకు స్నానం చేయిస్తారు. పూలదండ వేసి పసుపు కుంకుమ బొట్లు పెట్టి దేవుడు ఉన్న దిక్కు వైపు వదిలేస్తారు. గొర్రె జల్ల ఇవ్వగానే మొక్కు తీర్చుకుంటారు. లింగమంతుడు సహా చౌడేశ్వరి (చౌడమ్మ చాముండేశ్వరి), గంగాభవాని, ఆకు మంచమ్మ, మాణిక్యాల దేవి పూజలు అందుకుంటారు. లింగమంతుడు శాకాహారి కావడంతో ఆయనకు నైవేద్యం సమర్పిస్తారు. మిగిలిన దేవతలకు జంతుబలితో మొక్కు చెల్లిస్తారు. ఈ ఉత్సవాలు రెండేళ్లకోసారి జరుగుతాయి. ఈ ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివంచి మొక్కులను చెల్లించుకుంటారు. మణుగూరు సింగరేణి సంస్థ వారు జాతరకు వెళ్లడానికి రోడ్డు, విద్యుత్ సౌకర్యాలను ఏర్పాటు చేశారు. జాతరకు వచ్చే భక్తులకు ఆలయ కమిటీ వారు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తుంటారు. ప్రతి ఏటా సుమారు రెండు లక్షల పైనే భక్తులు ఈ జాతరకి వస్తుంటారు.

## ఇ - పంచాయతీ సేవలు అమలులో
# ముదిగొండ ముందంజ



**ప్రజాపక్షం/ముదిగొండ :** గ్రామ పంచాయతీల్లో అవినీతి, అక్రమాలు నిరోధించడానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇ పంచాయతీ సేవలు అమలులో ముదిగొండ మండలం ముందంజ లో ఉన్నది. సాంకేతిక సమాచార వ్యవస్థ ను వినియోగించుకొని గ్రామ పంచాయతీ ల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించటమే కాకుండా పరిపాలన మరింత శక్తి వంతంగా తయారుచేసేందుకు ప్రభుత్వం ఇ పంచాయతీ కార్యక్రమం ను రూపొందించింది. పంచాయతీల కంప్యూటరికరణ లో భాగంగా మండలం లో ఉన్న 25 గ్రామ పంచాయతీ ల్లో కంప్యూటర్లు, స్కానర్లు పంపిణీ చేశారు. ముదిగొండ మండల పరిషత్ కార్యాలయంలో పూర్తి స్థాయిలో ఇంటర్నెట్ ఏర్పాటు చేసి వీటి ద్వారా అన్ని పంచాయతీలకు ఆన్ లైన్ సౌకర్యం కల్పించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత సమర్ధవంతంగా అమలు చేసిన ప్రజాపాలన దరఖాస్తులను అంతర్జాలంలో నమోదు చేయడంలో డాటా కంప్యూటర్ ఆపరేటర్లు ముఖ్య భూమిక పోషించారు. ధృవ పత్రాలు మినహా జనన మరణ ధృవీకరణ పత్రాలు, భవన నిర్మాణం, ఆస్తి మార్పిడి, వ్యాపార లైసెన్సులు, నెలవారీ యాక్టివిటీ, ఆసరా పింఛన్ల నమోదు, ఇందిరమ్మ గృహ లక్ష్మి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల రుణాలు, ఇంటి పన్నులు, నీటి పన్నులు చెల్లింపులు, పారిశుధ్యం పనులు గ్రామ పంచాయతీ ఆదాయ, వ్యయాలను ఆపరేటర్లు ఎప్పటికప్పుడు కంప్యూటరీకరణ చేస్తున్నారు. కేంద్రానికి చెందిన నేషనల్ పంచాయతీ పోర్టల్, నేషనల్ ఎసెట్ డైరెక్టరీ, పిఎఫ్ ఎం ఎస్, ఈ గ్రామ్, స్వరాజ్, లోకల్ గవర్నమెంట్ డైరెక్టరీ, ఆస్తుల జియో ట్యాగ్ వంటి పథకాలను ప్రభుత్వ వైబ్ సైట్ లో నమోదు చేస్తున్నారు. వీటితో పాటు పంచాయతీ భవనాలు, ప్రాథమిక పాఠశాలలు, అంగన్వాడీ స్కూల్లు, మంచినీటి ట్యాంకులు, గ్రామ సభలు వివరాలు ఇ పంచాయతీ లో పొందుపర్చుతున్నారు. మార్చి 31 లోపు పంచాయతీలకు చెందిన అకౌంటింగ్ రికార్డులను ఆన్ లైన్ లో పెట్టాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేస్తే ఇప్పటికే ఆపరేటర్లు ఆన్ లైన్ లో పొందుపర్చారు. ఇప్పటివరకు జిల్లాలో ముదిగొండ మండలం పంచాయతీ లకు చెందిన రికార్డులు మాత్రమే అంతర్జాలంలో కనిపిస్తుండటం విశేషం. మండలం లో పంచాయతీ అప్లికేష న్లు పర్యేవేక్షించడానికి 2016 లో నలుగురు ఆపరేటర్లు ను ఔట్ సోర్సింగ్ పద్ధతిలో విధుల్లోకి తీసుకున్నారు. 25 గ్రామ పంచాయతీ ల్లో ఇ పంచాయతీ సేవలు అందించేందుకు నలుగురు మాత్రమే ఉన్నా ఎటువంటి జాప్యం లేకుండా పాలనాపరమైన సేవలు పూర్తి స్థాయిలో ఆన్ లైన్ లో పొందుపర్చుతున్నారు. ప్రభుత్వం స్పందించి పంచాయతీ లో ఒక్కంటికీ చోప్పున డాటా ఎంట్రీ ఆపరేటర్లు ను నియమిస్తే బాగుంటుంది. డాటా ఎంట్రీ ఆపరేటర్లు జీతాలు కూడా పెంచాల్సిన అవసరం ఉంది.

## హామీలను అమలు చేయాలని ఆటోవాలాల నిరసన



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** శనివారం రాష్ట్ర ఆటో వర్కర్స్ యూనియన్ జే ఏ సీ పిలుపులో భాగంగా బస్టాండ్ సెంటర్ అమరవీరుల స్తూపం వద్ద తెలంగాణ రాష్ట్ర ఆటో వర్కర్స్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కంచర్ల జమలయ్య మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని ఆటో డ్రైవర్లకు 12,000 అమలు చేయాలని, ఆటో కార్మికులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమే తమ వాహనాలకు మూడవ పార్టీ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మొదటి ప్రాధాన్యత ఆటో డ్రైవర్లకు ఇవ్వాలని తెలిపారు. తక్షణమే ఆటో డ్రైవర్లకి ఇస్తానన్న సంవత్సరానికి 12000 ఇవ్వకపోతే భవిష్యత్తులో జరగబోయే ఉద్యమాలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలి చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి బత్తుల సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి మర్రి కృష్ణ, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు అబ్బులు, పాష నరసింహ, లక్ష్మణ్, రామరాజు విజ్జి, కన్ను, చింటూ, బడుగు భాస్కర్ బాబు జాని రాజేందర్ పాల్గొన్నారు.

## ఘనంగా శేషగిరిరావు 77వ వర్ధంతి



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియూ సి నిర్మాత ప్రధాన కార్యదర్శి అమరజీవి దేవురి శేషగిరి రావు 77వ వర్ధంతి శనివారం స్థానిక శేషగిరి భవన్ నందు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ కార్పొరేట్ సెక్రటరీ రమణమూర్తి మాట్లాడుతూ.1942 లో నాటి నాయకులు సర్వదేవబాట్ల రామనాథం, మఖ్దూం మోహిఉద్దీన్, రాజబహదూర్ గౌర్ మనుబోతుల కొమరయ్య తదితరులు యూనియన్ స్థాపించిన వారిలో ప్రముకులు శేషగిరి రావు నెల్లూరు జిల్లా నుండి వలస వచ్చి హెడ్ ఆఫీసు లో క్లర్క్ గా పనిచేస్తూ బొగ్గు బావులల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల పని పరిస్థితులని, వారికి చెల్లించే జీతాలు కాంట్రాక్టర్ల ద్వారా, చిన్నపిల్లలు, మహిళలను బొగ్గు బావుల వద్ద పనులను చేయిస్తూ. నిర్దిష్టమైన పనిగంటలు అమలు చేయకుండా బానిసలు గా వాడుకోవడం జరుగుతున్న తరుణంలో నాటి పరిస్థితులపై వారి దయానందన బ్రతుకులను చూసి వారికి పోరాటాల ద్వారా న్యాయం చేయాలనే ఉద్దేశంతో యూనియన్ పెట్టె అవకాశం లేకున్నా హేమచంద్రపురం అడవులల్లో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ని స్థాపించి అట్టి నికృష్ట జీవితాలు అనుభవిస్తున్న కార్మికులకు దశ నిర్దేశం చేసిన నాయకుడు శేషగిరి రావు, యూనియన్ స్థాపించిన నాటి నుండి శేషగిరి రావు పై రజాకార్లు తమ కోవర్టుల ద్వారా ఆయన కదలికలను ఎప్పటికప్పుడు గమనించే వారు ఆయన రంగయ్య, పాపయ్య లతో కలసి భద్రాచలం వెళుతుండగా రజాకార్లు దొంగ చాటుగా కాల్చి చంపడం జరిగింది. ఐనా శేషగిరి రావు స్థాపించిన యూనియన్ అంచలంచలుగా పెరుగుతూ కార్మికులకు కనీస వేతనాలు, పనిగంటలు తదితర విషయాలను మెరుగు పరిచి కాంట్రాక్ట్ విధానానికి స్వస్తి పలికిన మహా నాయకుడు శేషగిరి రావు అని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సలహాదారులు దమ్మాలపాటి శేషయ్య, కార్పొరేట్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్.వి.రమణమూర్తి, కొత్తగూడెం ఏరియా బ్రాంచ్ కార్యదర్శి వి.మల్లికార్జున రావు, సెంట్రల్ ఆర్గ నైజింగ్ కార్యదర్శి జి.వీరస్వామి, సత్తుపల్లి కార్యదర్శి ఎస్.సుధాకర్, ఏరియా వైస్ ప్రెసిడెంట్ కె.రాములు, ఎస్.శ్రీనివాస్, గోపి,టి.నాగయ్య, రమేశ్, గణేశ్, లక్ష్మయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి బియ్యం అందజేత



**ప్రజాపక్షం/ములకలపల్లి:** మండల పరిధిలోని సీతారాంపురం పంచాయితీ సుబ్బనపల్లి గ్రామంలో ఇటీవల విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన బండి వెంకటమ్మ కుటుంబానికి ములకలపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తాండ్ర ప్రభాకర్ తన సానుభూతి తెలిపారు. ఈసందర్భంగా 25 కేజీల బియ్యం అందజేశారు. ఈకార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కరటూరు కృష్ణ, సీతారాంపురం గ్రామ పంచాయితీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంజుమ్, కోండ్రు భాస్కర్, కుంజా రవి, పరిషిక ప్రసాద్, తదితరులు ఉన్నారు.

## ఘనంగా సేవాలాల్ జయంతి



**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లిః** లక్ష్మీ దేవిపల్లి మండలం బావోజి గ్రామపంచాయతీలో సేవాలాల్ మహారాజ్ 286వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం కన్వీనర్ వాంకుడోతు అమర్‌సింగ్ మాట్లాడుతూ సేవాలాల మహారాజ్ బంజారా జాతి అభివృద్ధి కోసం తన జీవితాన్ని త్యాగం చేశారని అన్నారు. బంజారా తండాల్లో ప్రజలు సన్మార్గంలో నడుచుకోవాలని అన్నారు. సేవా దృక్పథం కలిగి ఉండాలని, సమసమాజ నిర్మాణం కోసం ప్రతిఒక్క బంజారా బిడ్డ కృషి చేయాలని అన్నారు. జాతి హక్కుల కోసం ఐక్యంగా అందరం కలిసి పోరాడాలని అన్నారు. సేవాలాల్ పోరాట స్ఫూర్తిని కొనసాగించాలని, బంజారా ప్రజానీకానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా నాయకులు వాంకుడోత్ కొబల్, తేజావత్ వెంకన్న, తేజావత్, శ్రీను, వాల్య, సామ్య, జరుపుల శంకర్, కుమార్, రమేష్, సీతారాంపాల్గొన్నారు.

## భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలి



**ప్రజాపక్షం/సత్తుపల్లిః** ఈనెల 26న జరిగే మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నీలాద్రి జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆలయ ఈఓ, చైర్మన్ లకు సూచించారు రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డా. మట్టా దయానంద్ విజయ్ కుమార్. శనివారం నియోజకవర్గ పరిధిలోని పెనుబల్లి మండలం నీలాద్రీశ్వరుని ఆలయాన్ని దయానంద్ సందర్శించారు. ఈ సందర్భంగా నీలాద్రి ఆలయ ఈఓ, ఆలయ చైర్మన్, డైరెక్టర్ లతో కలిసి శివరాత్రి పండుగ ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. త్రాగు నీరు, దర్శనం ఏర్పాట్లు, ట్రాఫిక్, దుకాణాలు, పరిశుభ్రత, పార్కింగ్, అన్నదానం, విశ్రాంతి, మహిళలకు ప్రత్యేక భద్రత ఏర్పాట్లు, టాయిలెట్స్, ప్రసాదం కౌంటర్‌లు, భక్తులకు బస్ సౌకర్యం తదితర ఏర్పాట్లకు సంబంధించి ముందుగానే ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## బుగ్గవాగు కాలువను పరిశీలించిన ఇరిగేషన్ అధికారులు



**ప్రజాపక్షం/కామేపల్లి:** పుల్లూరు బుగ్గ వాగు ఆనకట్టు నుండి వచ్చే కుడి ఎడమ పంట కాలువ పుల్లూరు, పొన్నెకల్లు, బర్లగూడెం, నెమలిపురి, గోవింద్రాల, బండిపాడు చెందిన రైతుల పొలాలకు సాగునీరు అందించే ఈ కాల్వ ఐదు కిలోమీటర్ల వరకు ఉన్నది. ఈ మధ్యకాలంలో వచ్చిన అధిక తుఫానుల వల్ల వచ్చిన వరద కు ఈ కాల్వా చాలా వరకు పెద్ద పెద్ద గండ్లు పడటం జరిగింది. ఈవిషయమై మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గింజల నరసింహారెడ్డి ఎంఎల్‌ఏ కనకయ్య దృష్టికి తీసుకెళ్లగా తక్షణమే స్పందించిన ఎంఎల్‌ఏ ఇరిగేషన్ ఉన్నతాధికారులతో మాట్లాడారు. దీనిలో భాగంగా హైదరాబాద్ నుండి ఆపరేషన్, మెయింటెనెన్స్ విభాగానికి చెందిన సూపరిండెంట్ ఆఫ్ ఇంజనీర్ పి సత్యనారాయణ వచ్చి రెండు కిలోమీటర్ల దూరం ప్రత్యేకంగా నడిచి గండ్లు పడిన ప్రదేశాన్ని పరిశీలించారు. తక్షణమే ఈ కాల్వకు ఐదు కిలోమీటర్ల మేర సిల్టు తొలగించి, సీసీ గైడ్ వాల్స్ నిర్మాణం కొరకు ఎస్టిమేషన్స్ చేయించి శాంక్షన్ ఇప్పిస్తామని, రైతులకు హామీ ఇచ్చారు. ఈసందర్భంగా ఆయకట్టు రైతులు ఎంఎల్‌ఏ కోరం కనకయ్యకి, ఇరిగేషన్ అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వారి వెంట ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్ చార్యులు, డివిజనల్ ఇంజనీర్ శంకర్, ఏ ఈఈ రమేష్ పాల్గొన్నారు.

# ఆటో జేఏసి ఆధ్వర్యంలో ఆందోళన



ప్రజాపక్షం/ఖమ్మం : రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని జిల్లా ఆటో యూనియన్ జేఏసి ఆధ్వర్యంలో శనివారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసి నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉచిత బస్సు ప్రవేశపెట్టడం వల్ల ఆటో కార్మికుల జీవితాలు దుర్భరంగా మారాయని ఆరోపించారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆటో డ్రైవర్లకు సంక్షేమ పథకాలను అమలు చేస్తామని చెప్పి బంద్‌ను విరమింపజేసి ఇప్పుడు కనీసం స్పందించడం లేదన్నారు. ప్రభుత్వం ఆటో వర్కర్లకు సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని వర్తింపజేయాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, డీజిల్, గ్యాస్, పెట్రోల్ పై జిఎస్టి పరిధిలోకి తీసుకుని రావాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైఖరి కారణంగా 60 మంది ఆటో కార్మికులు వివిధ కారణాలతో మరణించారని తెలిపారు. మరణించిన ప్రతి కుటుంబానికి ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, 2019 మోటార్ యాక్ట్‌ను రద్దు చేయాలని జేఏసి నాయకులు కోరారు.ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా కార్యదర్శి పేరబోయిన మోహన్‌రావు, సిఐటియు కార్యదర్శి ఉపేందర్, టియుసిఐ నాయకులు శ్రీనివాస్ తదితరులు ప్రసంగించగా ఈ కార్యక్రమంలో లక్ష్మీ నారాయణ, మల్లికార్జునరావు, విద్యాసాగర్, వెంకన్న, శ్రీను, నాగేశ్వరరావు, భద్రం, రమేష్, నర్సయ్య, రాందాస్, బాషా తదితరులు పాల్గొన్నారు

# మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

## సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్



ప్రజాపక్షం/ఏన్కూరుః మెదక్ జిల్లా చేగుంట మండలంలో సిఆర్పీలుగా విధులు నిర్వహిస్తూ శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రమేష్, ఎర్ర శ్రీనివాస్ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ మండల వనరుల కార్యాలయం ఎదుట శనివారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపి రెండు నిముషాల పాటు మౌనం పాటించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి రెండు కుటుంబాలకు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో పాటు కుటుంబంలో అర్హులైన ఒకరికి కారుణ్య నియామకం క్రింద ఉద్యోగం ఇవ్వాలన్నారు. రాష్ట్ర అధికారులు సమ్మె కాలంలో సమగ్ర శిక్షా ఉద్యోగులకు ఇచ్చిన హామీల ప్రకారం ప్రొసీడింగ్ వెంటనే విడుదల చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిఎస్ఎస్‌యుఎస్ మండల అధ్యక్షులు కృష్ణప్రసాద్, మెసెంజర్స్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుద్రగిరి, సిబ్బంది హరిత, లత, సుమన్, శివాజి, సాంబయ్య, కెజిబివి సిబ్బంది మంగతాయారు, విజేత, వినోద, సరిత, అపర్ణ, కవిత తదితరులు పాల్గొన్నారు.

# అనంతరామయ్యకు మంత్రి తుమ్మల ఘన నివాళి

ప్రజాపక్షం/ఏన్కూరుః గుత్తా అనంతరామయ్యకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం నివాళులు అర్పించారు. మండల పరిధిలోని జన్నారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ జిల్లా నాయకులు గుత్తా వెంకటేశ్వరరావు తండ్రి అనంతరామయ్య మృతి చెందిన సంఘటన తెలుసుకున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జన్నారం గ్రామంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం గుత్తా వెంకటేశ్వరరావును పరామర్శించి ధైర్యంగా ఉండాలని కోరారు. నివాళులు అర్పించిన వారిలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, ఖమ్మం కార్పొరేటర్ కాపర్తకు మురళి, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీ నారాయణ, మాజీ రైతుబంధు సమన్వయ సమితి సభ్యులు వెంకటేశ్వరరావు, వైరా మాజీ మున్సిపాల్ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు స్వర్ణ నరేందర్, వివిధ పార్టీల నాయకులు కరణం ప్రసాద్, మేడా



ధర్మారావు, యండ్రాతి శ్రీను బానోతు రామారావు, రేగళ్ల నాగయ్య, జాగర్లమూడి సురేష్, శోభన్‌నాయక్, నల్లమల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ సమాజ స్థాపకుడు సేవాలాల్

ప్రజాపక్షం/చింతకాని : ఉత్తమ సమాజ స్థాపకుడు సంత్ సేవాలాల్‌అని చింతకాని తహసీల్దార్ కూరపాటి అనంతరాజు కొనియాడారు. సంత్ సేవాలాల్ 286వ జయంతిని చింతకాని మండలం వందనం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా తహసీల్దార్ అనంతరాజు మాట్లాడుతూ వెనుకబడిన బంజారాను జ్ఞాన బోధనతో తాత్విక పునాదినిచ్చిన దీపం సేవాలాల్ అని కీర్తించారు. అంతకు ముందు పూజలు , సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నయాబ్ తహసీల్దార్ వీరభద్రునాయక్, గిర్దావర్ సోయం రఘు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, బంజారా పెద్దలు లకావత్ నాగులు, లకావత్ రామకృష్ణ, బాణోత్ రమేష్, షేక్ జానీ, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్మీజవాన్‌ను హెడ్‌క్వార్టర్స్‌కు అప్పగింత

### వైరా ఏసీపీ రెహ్మాన్



ప్రజాపక్షం/చింతకాని : ఆర్మీ జవాన్ బూదాల మనోజ్ విధులకు గైర్హాజరై తప్పించుకొని తిరుగుతున్న నేపథ్యంలో ఆర్మీ అధికారుల డిజెక్టర్ ఉత్తర్వుల ప్రకారం ఆయన్ను పట్టుకొని హెడ్‌క్వార్టర్స్‌కు అప్పగించినట్లు వైరా ఏసీపీ రెహ్మాన్ తెలిపారు.చింతకాని పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ సదరు జవాన్ గతంలో కూడా విధులకు గైర్హాజరైనట్లు ,అతనిపై లైంగిక వేధింపుల కేసుతోపాటు భార్యను వేధించిన కేసుల్లో నిందితుడిగా ఉన్నాడని ఏసీపీ తెలిపారు. పదిరోజుల క్రితం నాగులవంచ పెట్రోల్‌బంక్‌లో అర్ధరాత్రి జరిగిన ఘర్షణలో కూడా మనోజ్ నిందితుడన్నారు. ఎలాంటి ఆరోపణలు లేకుండా నిష్పక్షపాతంగా విచారణ జరుపుతున్న క్రమంలో బూదాల మనోజ్ అనే ఆర్మీజవాన్ ఉద్దేశ్యపూర్వకంగా సామాజిక మాధ్యమాల్లో పోలీసులపై అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకుంటామని ఏసీపీ హెచ్చరించారు.

# మీనాక్షి నటరాజన్ నియామకం పట్ల హర్షం



ప్రజాపక్షం/వైరాః తెలంగాణ రాష్ట్ర కాంఎ్రగెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జిగా మీనాక్షి నటరాజన్‌ను నియమించడం పట్ల రాష్ట్ర యువజన కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి కట్ల సంతోష్ ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. మీనాక్షి నటరాజన్‌కు తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాల పట్ల పూర్తి అవగాహన కలిగిన వ్యక్తి మాజీ పార్లమెంటు సభ్యురాలిగా, అఖిల భారత ఎన్ఎస్‌యుఐ అధ్యక్షురాలిగా, మధ్యప్రదేశ్ యువజన కాంగ్రెస్ అధ్యక్షురాలిగా క్రమశిక్షణ కలిగిన కాంగ్రెస్ నాయకురాలిగా ఎదిగారని, తెలంగాణ రాష్ట్రంలో అటు పార్టీని, ప్రభుత్వాన్ని సమన్వయం చేస్తూ ముందుకు నడుపుతారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మీనాక్షి నటరాజన్‌ను తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జిగా నియమించినందుకు ఖర్గేకి, మాజీ అధ్యక్షులు రాహుల్‌గాంధికి ధన్యవాదాలు తెలిపారు.

# ఘనంగా శ్రీసంత్ సేవాలాల్ జయంతి



ప్రజాపక్షం/వైరాః తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో బంజారాహిల్స్ బంజారా భవన్ నందు శ్రీసంత్ సేవాలాల్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్కతో పాటు మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారు వేం.నరేందర్‌రెడ్డి, గిరిజన ఎమ్మెల్యేలు, ఎంపిలు, గిరిజన నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మాట్లాడుతూ గిరిజనుల ఆరాధ్య దైవం ఎంతో ఆధ్యాత్మికత కలిగి భారతదేశం గర్వించదగ్గ గొప్ప మహోన్నత వ్యక్తి శ్రీసంత్ సేవాలాల్ అని వారి జయంతి సందర్భంగా కొనియాడారు.

# శ్రీ వెంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు



ప్రజాపక్షం/ ఎర్రుపాలెం : తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం నందు అలివేలు మంగా, పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానార్చకులు శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో పంచామృతాలతో సర్వాంగాభిషేకం, స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుండి వచ్చిన భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తమ మొక్కులను చెల్లించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదానం నిర్వహించారు. స్వామి వారి ఆలయ దాత, అన్నదాన భవనం నిర్మాణ దాత ఎల్వదం గ్రామానికి చెందిన లక్కిరెడ్డి జయప్రకాశ్‌రెడ్డి, అన్నపూర్ణ దంపతులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా దంపతులకు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికగా ప్రత్యేక పూజల అనంతరం వారికి స్వామి వారి శేష వస్త్రాలు, ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఈఓ కొత్తూరు జగన్మోహన్‌రావు, ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ఇతర ఆలయ సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# కెసిఆర్ జన్మదిన వేడుకలకు బిఆర్ఎస్ శ్రేణులు తరలిరావాలి



ప్రజాపక్షం/ఏన్కూరుః ఈ నెల17న బిఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పుట్టినరోజు వేడుకలను ఏన్కూరు మండలంలో పెద్ద ఎత్తున నిర్వహించడం జరుగుతుందని, ఈ జన్మదిన వేడుకల్లో బిఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున ఏన్కూరుకు ఉదయం 9గంటలకు తరలిరావాలని బిఆర్ఎస్ వైరా నియోజకవర్గ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే బానోతు మదన్‌లాల్ అన్నారు. కెసిఆర్ పుట్టినరోజు సందర్భంగా ఏన్కూరు మండలంలో నాచారంలో ఉదయం 9.30 గంటలకు నాచారం వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, మొక్కులు నాటే కార్యక్రమం, ఏన్కూరులో ఉదయం 10గంటలకు మసీదులో ప్రార్థనలు, 11 గంటలకు ఏన్కూరు చర్చిలో ప్రార్థనలు, 12 గంటలకు ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు పంపిణీ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. నియోజకవర్గంలో పరిధిలోని జూలురుపాడు, కారేపల్లి, కొణిజర్ల, వైరా నుండి పెద్ద ఎత్తున బిఆర్ఎస్ శ్రేణులు ఏన్కూరులో ఉదయం 9గంటలకు చేరుకోవాలని వైరా మాజీ శాసనసభ్యులు బానోతు మదన్‌లాల్ అన్నారు.

# సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి

**- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్**





**ప్రజాపక్షం / భద్రాచలం :** సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. శనివారం బంజారా వైద్య,ఆరోగ్య శాఖ ఉద్యోగుల ఆధ్వర్యంలో ఇల్లందు క్రాస్ రోడ్‌లో గల కార్తీక వనంలో ఏర్పాటు చేసిన సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి ఉత్సవాలకు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా కలెక్టర్‌ను బంజారా సాంప్రదాయం ప్రకారం బంజారా ఉద్యోగులు సంప్రదాయ పద్ధతిలో తలపాగా చుట్టి ఎద్దుల బండిపై వేదిక వద్దకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జ్యోతి ప్రజ్వలన చేసి, భోగ్ బండారో, వింతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ తన బోధనల ద్వారా బంజారా జాతి అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. తండాల నిర్మాణానికి తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. హింస, మత్తు, ధూమపానాలకు దూరంగా ఉండాలని హితువు పలికి యావత్ ప్రజానీకానికి ఆదర్శంగా నిలిచారని, బంజారా జాతిని చీకటి నుంచి వెలుగులోకి తీసుకొచ్చిన ఒక విప్లవ చైతన్య మూర్తి అని, దేశం గర్వించదగ్గ గొప్ప ఆధ్యాత్మికవేత్త, సమాజ శ్రేయస్సు కోసం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ చూపించిన మార్గం అందరికీ ఆదర్శనీయమన్నారు. సేవాలాల్ మహారాజ్ తన బోధనల వల్ల బంజారా జాతి పురోగమించడానికి కృషి చేశారని పేర్కొన్నారు. సంత్ సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గంలో మనమందరం పయనించి ఆయన ఆశయాలను కొనసాగించాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా, వైద్యశాఖ అధికారి భాస్కర్‌నాయక్, డిసిహెచ్ఎస్ రవిబాబు, జి జి హెచ్ ఆర్ ఎం ఓ రమేష్, బంజారా వైద్యులు, వైద్య,ఆరోగ్య శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

# స్వర్ణలత సేవలు మరవలేనివి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** కాంగ్రెస్ నాయకురాలు గోళ్ల స్వర్ణలత చేసిన సామాజిక సేవ కార్యక్రమాలు మరవలేనివి అని నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు పేర్కొన్నారు. మండలం లోని భైరవుని పల్లి లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాయకులు గోళ్ల శ్రీనివాసరావు సతీమణి స్వర్ణలత దశ, దిన కార్యక్రమం శనివారం జరిగింది. ఆమె చిత్ర పటం కు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గోళ్ల స్వర్ణలత సామాజిక సేవలతో పాటు, కాంగ్రెస్ అభ్యున్నతి కోసం పాటుపడ్డారని అన్నారు. ఆమె మృతి పార్టీకి తీరని లోటు అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, నాయకులు బచ్చలకూరి నాగరాజు, మల్లేబోయన శ్రీనివాస్ రావు,బోయిన వేణు,మరికంటి రమేష్,మస్తాన్, సూరేపల్లి రామారావు, గండు సైదులు,గోపి ఉపేందర్, పెద్దపాక ముత్తయ్య, పతానపు నాగయ్య, బోయిన రేణుకరావు. రోశయ్య. కాలంగి నాగేశ్వరరావు, డేగల వేణు తదితరులు పాల్గొన్నారు.

# సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను అరికట్టవచ్చు

**-జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు**



**ప్రజాపక్షం / భద్రాచలం :** సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల నేరాలు అరికట్టే అవకాశం ఉందని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. జిల్లా పరిధిలోని పరిశ్రమలు, వ్యాపార సముదాయాలు, కాలనీలు, ఇండ్ల పరిసరాలలో సీసీ కెమెరాల ఏర్పాటు పై ప్రజలకు అవగాహన కల్పించాలని పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేస్తూ శనివారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని, సీసీ కెమెరాల వల్ల భద్రాతా ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు. దొంగతనాల నివారణకు, రోడ్డు ప్రమాదాల్లో వాహనాలను గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. జిల్లాలోని ప్రధాన రహదారులు, ముఖ్యమైన ప్రదేశాలలో కెమెరాలను ఏర్పాటు చేస్తే నేరాలను అరికట్టవచ్చని తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు పరిశ్రమల యాజమాన్యాలు, వ్యాపారస్తులు, అన్ని వర్గాల ప్రజలు పోలీసు వారికి సహకరించాలని కోరారు. ఇప్పటికే జిల్లాలో నమోదైన చాలా కేసుల్లో సీసీ కెమెరాల ద్వారా నిందితులను పట్టుకోవడం జరిగిందని అన్నారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని ముఖ్యమైన ప్రదేశాలు, కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు. నేరాలను ఛేదించడంతో పాటు నియంత్రించడంలో సీసీ కెమెరాల పాత్ర కీలకంగా మారిందని అన్నారు. జిల్లా ప్రజలందరూ పోలీస్ యంత్రాంగానికి సహకరిస్తూ తాము నివసించే ప్రదేశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

# సేవాలాల్ చూపిన మార్గం అనుసరణీయం



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గం అనుసరణీయం అని టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు తేజావత్ గోవిందరావు సూచించారు. మండల కేంద్రంలో సంత్ సేవాలాల్ జయంతి మహోత్సవం సందర్భంగా శనివారం కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్ర పటం కు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యావత్ భారత్ దేశం అంతా చిన్నాభిన్నంగా ఉన్నా బంజారా సమాజాన్ని ఏకం చేశారని గుర్తు చేశారు. మూడ నమ్మకాల నుంచి హింసా, మద్యపానం, పొగత్రాగటం, మొదలగు వ్యసనాలకు బానిస కాకుండా స్వచ్ఛమైన సాత్విక జీవనం కొనసాగించాలని సూచించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం పెద్దలు తేజావత్ కోటేశ్వరరావు, ఇస్లావత్ బిక్షం తదితరులు పాల్గొన్నారు.

# షేక్ అజీమ్ జేఈఈ ఎంఎటికు అర్హత



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** బోదులబండ గ్రామానికి చెందిన షేక్ అజీమ్ జేఈఈ ఎంఎటి అర్హత సాధించారు అని. తెలంగాణా మైనారిటీ రెసిడెన్సియల్ జూనియర్ కళాశాల సెక్రటరీ మొహమ్మద్ ఫహీముద్దీన్ ఖురేషి శనివారం ఒక ప్రకటన లో తెలిపారు. హైదరాబాద్ లోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ బార్కస్ విద్యార్థులు అత్యధికంగా 98.4 శాతం మార్కులు సాధించినట్లు తెలిపారు. తెలంగాణా రెసిడెన్షియల్ కళాశాల లొ మైనారిటీ విద్యార్థులకు తెలంగాణా ప్రభుత్వం ఐఐటి మరియు జేఈఈ మెయిన్స్ కు ఉచిత ట్యూషన్ అందించి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు దోహదం చేస్తుందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మైనారిటీ విద్యార్థులకు తెలంగాణా ప్రభుత్వం అండగా ఉంటుందని అర్హత సాధించిన విద్యార్థులకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, తెలంగాణా రెసిడెన్సియల్ జూనియర్ కళాశాలల సెక్రటరీ మొహమ్మద్ ఫహీముద్దీన్ ఖురేషి బార్కస్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా కళాశాల అధ్యాపకులకు అభినందనలు తెలిపారు. ఈ విషయం పట్ల షేక్ అజీమ్ తల్లీ తండ్రులు మరియు గ్రామస్థులు , బిజెపి మండల అద్యక్షుడు పాగర్తి సుధాకర్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు సయ్యదు మొహినుద్దీన్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

# ఘనంగా సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు







**ప్రజాపక్షం/పాల్వంచ :** సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి వేడుకలు శనివారం పాల్వంచ మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. పట్టణ పరిధిలోని బంజారా భవనంలో బంజారా భవన్ కమిటీ అధ్యక్షులు బానోత్ బాలు నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బంజారాల ఆరాధ్యదైవానికి అత్యంత భక్తి శ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించి, నైవేద్యాలను సమర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా టీఎస్ జెన్కో డైరెక్టర్ బాదావత్ లక్ష్మయ్య పాల్గొని సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జాతికి చేసిన సేవలను కొనియాడారు. బంజారా తండాలలో ప్రజలు సన్మార్గంలో నడుచుకోవాలని, సేవా దృక్పథం కలిగి ఉండాలని, సమ సమాజం నిర్మాణం కోసం ప్రతి ఒక్క బంజారా కృషి చేయాలని, జాతి హక్కుల కోసం అందరం కలిసి పోరాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బంజారా భవన్ కమిటీ జనరల్ సెక్రటరీ కొర్రా రాములు, వర్కింగ్ ప్రెసిడెంట్ భూక్యా చందునాయక్, కోశాధికారి భూక్యా సక్రాం, జాయింట్ సెక్రటరీ భూక్యా హిరన్ గాంధీ, బానోతు నాగేశ్వరరావు, జెన్కో డిఈ భూక్యా మంగీలాల్, ఎస్టీ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాందాస్, ఏడిఈ పులియా, టీచర్ నాగేశ్వరరావు, లాలు, జంకిలాల్, టీచర్ రమేష్ రాథోడ్, బన్సీలాల్, వీరన్న, వీరు, రామునాయక్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### పాండురంగాపురంలో...

మండల పరిధిలోని పాండురంగాపురంలో సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతిని పురష్కరించుకొని శనివారం వేడుకలు ఘనంగా నిర్వహంచారు. సేవాలాల్ సేన నాయకులు అంగోత్ నగేష్, ఇస్లావత్ బాలు, గుగులోత్ భద్రు, భానోత్ భరత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా గ్రీన్ ఎర్త్ సొసైటీ వ్యవస్థాపకులు రమేష్ రాథోడ్, (ట్రైబల్ వెల్ఫేర్) టీఎస్ టీడబ్ల్యూ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి రాములు నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సేవాలాల్ చిత్ర పటానికి పూలమాలలు వేసి అనంతరం మహాభోగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ పూజ కారక్రమం గోర్ శిక్వాడి రాష్ట్ర నాయకులు బానోత్ భోజ్యానాయక్ నిర్వహించారు. తదనంతరం రమేష్ రాథోడ్ మాట్లాడారు. అంగోత్ నగేష్ తల్లి మంగమ్మ జ్ఞాపకార్థం వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపేందర్, వెంకట్, మంగీలాల్, లక్ష్మోజీ, దేవి, ఈశ్వర్‌నాయక్, రమేష్, జబరులాల్, పంతులు, హరిలాల్ తదితరులు పాల్గొన్నారు.

### దమ్మపేట సెంటర్‌లో...

పాల్వంచ పట్టణ పరిధి దమ్మపేట సెంటర్‌లో బంజారాల ఆరాధ్యదైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను బీజేపీ గిరిజన మోర్చ నాయకుడు భట్టు నరేష్ నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి, కొబ్బరికాయలు కొట్టి ఆ మహనీయుడి సేవలను, ఉద్యమ చరిత్రను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆజ్మీరా రాము నాయక్, వెంకట్ నాయక్, కిరణ్‌నాయక్, వీరన్న నాయక్, ధనుష్‌నాయక్, రావేందర్‌నాయక్, ఆశోక్, అనిల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ కార్డుల సేవలు నిరంతర ప్రక్రియ..
# ప్రజలు సహకరించాలి



**ప్రజాపక్షం / పాల్వంచ :** కొత్త రేషన్ కార్డుల సేవలు నిరంతర ప్రక్రియ అని, ప్రజలు సహకరించాలని ఈడీఎం సైదేశ్వరరావు అన్నారు. ఈఎస్టీ కమిషనర్, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశాల మేరకు కొత్తగా ప్రవేశపెట్టిన రేషన్ కార్డ్ సేవ, మీ సేవ కేంద్రాల పనితీరును పరిశీలించడానికి ఈ డిస్టిక్ మేనేజర్ సైదేశ్వరరావు, టీజీటీఎస్ డిఎం రఘ శనివారం పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని మీసేవ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మీసేవ ఆపరేటర్లందరూ వివిధ అవసరాల కోసం మీసేవ కేంద్రాలకు వచ్చే ప్రజల వద్ద నుండి అదనపు రుసుములు వసూలు చేయకూడదని, మీసేవ కేంద్రానికి వచ్చే ప్రజల పట్ల మర్యాదపూర్వకంగా ఉండాలని సూచించారు. ఎవరైనా నిర్ణీత రుసుము కంటే అధికంగా వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు మీసేవ కేంద్రాలలో ఏదైనా సమస్యలు ఎదుర్కొన్నట్లయితే టోల్ ఫ్రీ నెంబర్ 1100 కి ఫోన్ చేయడం ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా వారు మీసేవల కేంద్రాల్లో ప్రజలతో కొత్త రేషన్ కార్డులు, రేషన్ కార్డుల్లో సవరణలు నిరంతర ప్రక్రియ అని అందరూ సహకరించాలని కోరారు.